
# సినీ బేతాళ కథలు

## - డా. కె.వివేకానందమూర్తి





*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

**- 42 -**

- *మరోనటి* -

**విక్రమార్కుడు** విసుగుపారేసుకుని, మళ్లీ బేతాళుడి శవాన్ని తన భుజం మీద వేసుకుని నడకసాగించాడు.

'విక్రా! దారిలో నీకు శ్రమ కలుగుతోందని అనిపించకుండా మరో కథ చెబుతాను విను! -' అని బేతాళుడు ప్రారంభించాడు.

"నీకు తెలుసో లేదో, అల్లిబిల్లి సూరి అనే తెలుగు నిర్మాత చాలా యేళ్ల క్రితం కాసిని తెలుగు సినిమాలు తీశాడు. వాటిలో వొక చిత్రాన్ని తీసేముందు కథ రెడీ చేసుకున్నాడు. అది హీరోయిన్‌కి ప్రధాన పాత్రవున్న కథ. అంచేత అనన్యంగా హావభావాలు పలికిస్తూ అద్భుతంగా నటించే హీరోయిన్ కావాలి. అతడి అభిమాననటి సావిత్రి. ఆ పాత్రకి సావిత్రే జీవంపోయగలదని ఆమె కాల్‌షీట్స్ కోసం ప్రయత్నించాడు. కానీ అప్పుడు ఆమె చాలా చిత్రాలు చేస్తూ బాగా బిజీగా వుంటూ అందనంత అగ్రతారగా వున్నారు. ఆమెకు మన సూరిగారి చిత్రానికి వెంటనే వొప్పుకోడం కుదిరేలాలేదు. ఒప్పుకున్న సినిమాలు పూర్తిచేస్తేగానీ సూరి చిత్రానికి ఆమె కాల్‌షీట్స్ యిచ్చే పరిస్థితిలో లేదు. అంచేత ఆమెను కలిసే ప్రయత్నంకూడా చెయ్యలేదు.

నిర్మాత అల్లిబిల్లి సూరికి అనిశ్చితంగా వెయిట్ చేయడం యిష్టంలేదు. అనుకున్న టైముకి తన బొమ్మ తయారుచేసి ప్రేక్షకుల ముందుకి తీసుకురావడం అతని అలవాటు. కనుక సావిత్రిగారిని మరిపించగల లేక స్ఫురించగల నటికోసం వెదకడం ప్రారంభించాడు. తెలుగు తెర చూపుమేరలో సావిత్రిగారి ఛాయలకు దగ్గరగా వున్న నటి యెవ్వరూ దొరకలేదు. ఏం చెయ్యాలిప్పుడు అని నిర్మాత మథనపడుతుంటే, కవి, దర్శకులిద్దరూ ఒక సూచన చేశారు - బొంబాయిలో (యిప్పటి ముంబై) గొప్ప ట్రాజెడీ హీరోయిన్ మీనాకుమారి, యిక్కడ మన సావిత్రికి దీటుగా చెయ్యగలదు. ఆమెను బుక్ చేసుకుని ఆ మీదట డబ్బింగు పెట్టుకో - అని -

'బొంబాయి వెళ్లడానికి నేను రెడీ - మరి నాకు హిందీరాదు. ఎవరేనా కూడా హిందీ తెలిసిన తెలుగువాడి సాయం కావాల' అన్నాడు సూరి.

దర్శకుడు 'మన కవిగారిని తీసుకెళ్లండి - ఈయనక్కాస్త హిందీవచ్చు. బాగానే మేనేజ్ చేస్తాడు.' అన్నాడు.

'ఏవయ్యా కవిరాజా! ఏంటి నువ్వు హిందీ మాటాడగలవా?' - అనడిగాడు నిర్మాత సూరి.

'హై హై' అన్నాడు కవిరాజు.

'హై హై - అంటే అర్థమేటీ?' అడిగాడు నిర్మాత.

'ఏవీ లేదు సార్ - ప్రతీ మాటకీ చివర హై, హూఁలాంటివి తగిలిస్తే అదే హిందీ. ఏం ఫర్వాలేదు. నేను చూసుకుంటాను -' అని హామీ యిచ్చాడు కవిరాజు.

నిర్మాత అల్లిబిల్లి సూరి, కథ రాసిన కవిరాజు కలిసి బొంబాయి చేరారు. మీనాకుమారి అడ్రసు పట్టుకుని ఆమె యింటికి వెళ్లారు. మదరాసీ నిర్మాతనని చెప్పి సూరి ఆమెని కలిసి మాట్లాడే ఏర్పాటు చేసుకున్నాడు.

'నమస్తే హై' అన్నాడు సూరి.

'ప్రణామ్ హూ' అన్నాడు కవిరాజు.

'నమస్కార్' - అంది మీనాకుమారి.

'మా హై చిత్రహై మీరు హై హీరోయిన్ క్రరుహై' అన్నాడు కవిరాజు.

'మై మా రోల్ నహీ కరూంగా - మై హీరోయిన్ హూఁ' అంది మీనా కుమారి.

'మా నహీ హై జీ, మా - అవరు అవరు చిత్రం మే హీరోయిన్' విడమర్చి చెప్పాడు కవిరాజు.

'హిందీ వచ్చని దీని పేనాలు తీస్తన్నావురా కవిరాజా' అన్నాడు సూరి.

మీనాకుమారి వీళ్ల హిందీ పాండిత్యం పసిగట్టి యింట్లో తెలుగువచ్చిన వంటావిడని పిలిచింది.

'ఏటీ యీ ముసిలావిడకి యేసం యిమ్మంటుందా?' అని గొణిగాడు సూరి.

'చెప్పండి బాబూ - ఏంటి విషయం?' అనడిగింది వంటావిడ.

తెలుగు నిర్మాత, కవి 'హమ్మయ్య హై' అనుకున్నారు.

సూరి చెప్పాడు - హిందీలో 'సల్తే సల్తే,' సినిమాని తెలుగులో 'వెళ్తే, వెళ్తే' అని తీత్తన్నాం.

వంటావిడ మీనాకుమారికి హిందీలో అనువదించి చెప్పింది. - 'చల్తే చల్తే' హిందీ చిత్రాన్ని తెలుగులో 'వెళ్తే వెళ్తే' అని తీస్తున్నారని.

వెంటనే మీనాకుమారి నేను రీమేకుల్లో చెయ్యనని హిందీలో అరిచింది.

అప్పుడు నిర్మాత - 'మా కవిగాడికి బాసరాదమ్మ, ఎదో టైటిల్లాగాడంతే - కథాడి సొంతవే - ' అని వివరించాడు.

'తెలుగమ్మాయిని యెందుకు పెట్టుకోవడంలేదు? నా దగ్గరికెందుకొచ్చారు?' అని హిందీలో అడిగింది మీనాకుమారి.

'అవునండి. అసలు సాయిత్తిరిగార్ననుకున్నాంవు. డేట్లు తేడా వచ్చినయ్యండి. మరావిడికి సమవుజ్జీ మీరేకదమ్మా! తవరు సేత్తే తిరుగుండదనుకుంటున్నాం.'- అన్నాడు సూరి.

'అవును హై - మీరెలాగైనా చెయ్యాలి హూఁ!' అని వంత పలికాడు కవిరాజు.

- యిప్పుడు చెప్పు విక్రమార్కా! హిందీ సూపర్ స్టార్ మీనాకుమారి అప్పుడు అల్లిబిల్లి సూరి చిత్రంలో నటించేందుకు ఆమోదించిందా? సావిత్రిని మరిపించే నటనతో హిందీ మీనాకుమారితో నిర్మాత సూరి తన 'వెళ్తే వెళ్తే' చిత్రం నిర్మించగలిగాడా? నా యీ ప్రశ్నలకు నువ్వు తెలిసీ సమాధానం చెప్పకపోయావో నీ తల వెయ్యిచెక్కలయి బొంబాయి సముద్రంలో కలిసిపోతుంది.'- అని బేతాళుడు ముగించాడు.

బదులుగా విక్రమార్కుడు, ' - లేదు బేతాళా! లేదు. హిందీ సూపర్ స్టార్ మీనాకుమారి తను మద్రాసు వచ్చినప్పుడల్లా, ప్రత్యేకంగా సావిత్రి సినిమాలు చూస్తానని, ఆమె నటన చూసి తాను నేర్చుకోవాల్సింది యెంతో వుందనీ, తను సావిత్రి చెయ్యదగ్గ

పాత్రను చెయ్యతగననీ మర్యాదగా నిర్మాత సూరికి నో చెప్పేసింది. యింకా - సావిత్రిలాంటి మరో నటి కావాలనుకుంటే ఆ మహానటే మరో నటి అని, మరో నటే మహానటి అనీ, మరేనటీ మహానటి కాజాలదనీ తన స్వచ్ఛమైన హిందీలో కచ్చితంగా మాట్లాడింది.

శనైఃశనైరుపరమేద్బుద్ధ్యాధృతిగృహీతయా।
ఆత్మసంస్థం మనః కృత్వా
న కించిదపి చింతయేత్ ॥

- వివేకముతో మెల్లమెల్లగా మనస్సును ఆత్మకంటె వేరైన వాటి నుండి మరల్చి ఆత్మయందే నిలిపి యితరములేనివి తలంచరాదు - అన్నారోయ్ గీతాచార్యులు శ్రీకృష్ణభగవానుడు' అని చెప్పి ముగించగానే, రాజుకి మౌన భంగం కలిగి, బేతాళుడు యెగిరి, గట్టెక్కి చెట్టెక్కిన తెలుగు సినిమాలాంటి చెట్టేక్కేసాడు మళ్లీ.

***(వచ్చేనెలలో మరోకథ)***

Post your comments